క్లుప్తంగా

త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో జడ్జి పూజలు


పూజలు చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పేట బస వన్నకట్టవీధిలోనున్న త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశామని ఆలయ అర్చకులు రాఘవ శర్మ తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం జడ్జిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న అతిథులు, లయన్స్‌క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 56 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 32 మంది కంటి శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు. అనంతరం క్యాంపు దాత, చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ చైర్మన్ జగదీశ్వరప్రసాద్‌ను సన్మానించారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి ఆకులేటి రమేష్‌బాబు, కోశాధికారి ఉలవల నాగేంద్ర, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గూడూరు మోహన్‌దాస్, పల్లెం వేణుగోపాల్, గోసే రాధాకృష్ణ, గూడురు రాజగోపాల్, మెటికల కుళ్లాయప్ప, ఉట్టి ప్రసాద్, కృష్ణ, చందా నాగరాజు, పుట్లూరు నరసింహులు, నాగేంద్ర పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్పెంటర్ మృతి


రామాంజనేయులు (ఫైల్)

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్పెంటర్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం.. గతేడాది డిసెంబర్ 28న ధర్మవరానికి చెందిన ఆదర్శ్, ఆదిత్యనారాయణ తాడిపత్రి నుంచి ధర్మవరం బైక్‌పై బయలుదేరారు. ఇదే సమయంలో బత్తలపల్లికి చెందిన కార్పెంటర్ వడ్డె రామాంజనేయులు(57) ధర్మవరం రోడ్డులోని మద్యం దుకాణం వద్ద రోడ్డు దాటుతుండగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆదర్శ్, రామాంజనేయులును స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామాంజనేయులు పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య అలివేలమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆదర్శ్ కూడా చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అంధుల మేధాశక్తి అపారం


అంధుడిని సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: అంధుల మేధాశక్తి అపారమని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ నరసింహులు తెలిపారు. లూయిస్ బ్రెయిల్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోనున్న కంటి ఆసుపత్రిలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు అంధులను సన్మానించారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ నరేంద్రరెడ్డి, కార్యదర్శి శివయ్య, ట్రెజరర్ సత్య నిర్ధారణ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత గంగరాజు

కదిరి టౌన్: పట్టణంలోని సెయింట్ థామస్ స్కూల్లో ఆదివారం రచయిత బత్తుల గంగరాజు రచించిన 'వడ్డెర ఓబన్న సంక్షిప్త చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు వడ్డెర ఓబన్న స్వాతంత్య్ర పోరాటాన్ని తెలియజేశారు. తొలి తరం స్వాతంత్య్ర సమరయోధుడిగా ఓబన్న చేసిన పోరాటాలను వెలుగులోకి తీసుకురావాలనే ఆయన చరిత్రపై పుస్తకం రచించినట్లు గంగరాజు తెలిపారు. కార్యక్రమంలో కదిరి వడ్డెర సంఘం అధ్యక్షుడు డాబా గంగయ్య, సైదాపురం రమణ, సంపంగి గోవర్ధన్, జైనుల్లా, ఉపాధ్యక్షులు నరసింహులు, బత్తల ప్రసాద్, త్రిలోక్ పాల్గొన్నారు.


పెచ్చులూడిపోతున్న ఎస్సీ హాస్టల్ భవనం పైకప్పు


అపరిశుభ్రంగా ఉన్న బాతురూమ్‌లు


శిథిలావస్థలో ఉన్న బీసీ హాస్టల్ భవనం

సంక్షేమం.. సంక్షోభం

- వసతిగృహాల్లో సౌకర్యాల లేమి
- కోడిగుడ్లు గుటకాయ స్వాహా
- చికెన్ వడ్డింపులోనూ చేతివాటం
- కంపు కొడుతున్న బాత్రూమ్‌లు

కదిరి టౌన్: సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కొరవడ్డాయి. విద్యార్థులు అరకొర వసతుల నడుమ నెట్టుకురావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కదిరి పట్టణంలో తొమ్మిది ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర, బాలికల వసతిగృహాలు ఉన్నాయి. వివిధ గ్రామాలకు చెందుతున్న వెయ్యి మంది విద్యార్థులు వసతిగృహాల్లో ఉంటున్నారు. ఇక్కడ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించి, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా చూడాల్సిన హాస్టల్ వార్డెన్లలో కొందరు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వారంలో మూడుసార్లు చికెన్ అందించాల్సి ఉండగా.. రెండుసార్లు మాత్రమే ఇస్తున్నారు. ఇక కోడిగుడ్డు ఒక వారం ఇస్తే.. మరొక వారం ఇవ్వడం లేదు. అమీన్ నగర్‌లోని బాలికల హాస్టల్‌లో భద్రత కరువైంది. బాలుర ఉన్నత పాఠశాల, కళాశాలల వసతిగృహాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. బాలుర బీసీ కళాశాల హాస్టల్‌ను ఏడాదికి రెండు సార్లు ప్రైవేట్ భవనాల్లోకి మారుస్తున్నారు. బీసీ బాలికల వసతిగృహానికి పక్కా భవనం లేదు. ఎస్సీ, బీసీ వసతిగృహాల భవనాల పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. ఎస్సీ హాస్టల్‌లో బాత్రూమ్‌ల నిర్వహణ లేకపోవడంతో కంపు కొడుతున్నాయి. అరకొర వసతుల నడుమ కొనసాగిస్తుండడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఏబీసీ డబ్ల్యూఓ బాలాజీని వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన ఫోన్ అందుబాటులోకి రాలేదు.

పక్కా భవనాలు నిర్మించాలి



శిథిల దశకు చేరుకున్న వసతి గృహాల భవనాలకు మరమ్మతులు చేయాలి. అద్దె భవనాల్లో అసౌకర్యాల నడుమ నడుపుతున్న హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి. మౌలిక సదుపాయాలు మెరుగుపరచి.. మెనూ పక్కాగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.
– నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆల్ ఇండియా స్టూడెంట్ పవర్

మందుబాబులను అడ్డుకునే వారు లేరా?


ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చెట్టుకింద ఖాళీ మద్యం సీసాలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ పరిసరాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. రాత్రి కాగానే కొందరు మద్యం ప్రియులు అక్కడి చేరుకుని యథేచ్ఛగా తమ పని కానిస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఉన్న పరిసర ప్రాంతంలో ఎమ్మార్సీ, హార్టికల్చర్, హౌసింగ్ ఏఈ, గ్రామ సచివాలయం -2, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడి సమీపంలోనే ప్రభుత్వ వైద్యశాల ఉంది. వీటితో పాటు కొందరు అక్కడ ఉన్న సిబ్బంది క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాయి. వీటికి గతంలో ప్రహరీ నిర్మించి గేట్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల ప్రహరీ గోడ కూలింది.దీంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ప్రభుత్వ కార్యాలయాల సరిహద్దుల్లో మందు బాబులు సేవించి పారేసిన మద్యం ఖాళీ బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్నా మందుబాబులు లెక్కచేయడం లేదు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో పోలీసులు నిఘా పెట్టి మందుబాబులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారిపై గుంతలతో ప్రమాదాలు


ధర్మవరం మార్గంలో దెబ్బతిన్న రహదారి

బత్తలపల్లి: మండల కేంద్రం సమీపంలోని బైపాస్ రోడ్డు బ్రిడ్జి కింద రోడ్డుపై గుంతలతో వాహనదారులు తరచూ ప్రమాదానికి గురవుతున్నారు. బైపాస్ రోడ్డు కారణంగా ధర్మవరం వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో తారు రోడ్డు వేసినప్పటికీ నాణ్యతగా లేపోవడంతో వేసిన రెండు నెలలకే దెబ్బతింది. రోడ్డు వేసే ముందు గతంలో ఉన్న రోడ్డును తొలగించి రోడ్డు వేయాల్సి ఉన్నా దాని గురించి పట్టించుకున్నట్లు లేదు. రోడ్డు మీద రోడ్డు వేయడం వల్ల రోడ్డు వేసేందుకు గ్రిప్ దొరకడంలేదని తెలుస్తోంది. జాతీయ రహదారిపై రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటే రైతులకు వార్నింగ్ ఇచ్చే సిబ్బంది, రోడ్డు దెబ్బతిని ప్రమాదాలకు గురవుతుంటే మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇక్కడ రోడ్డు దెబ్బతిన్న కారణంగా వాహనాలు సైడుకు వెళ్లి ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. ద్విచక్రవాహనదారులు డివైడర్‌ను ఢీ కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం మాలధారులకు అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు మాలధారులు అయ్యప్పస్వామికి పూజలు చేశారు. అన్నదానం చేయాలని అనుకునేవారు తమను సంప్రదించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

అనంతపురం: నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో రెండో సంవత్సరం చదువుతున్న చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురానికి చెందిన నారాయణ స్వామి కుమారుడు కిరణ్ (19) రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై వెళ్తుండగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద బైక్ అదుపు తప్పడంతో కింద పడిపోయాడు. హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కదిరి టౌన్: పట్టణంలోని రౌడీషీటర్లకు ఆదివారం డీఎస్పీ శివ నారాయణ స్వామి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లుగా ఉన్న వ్యక్తులు ఎటువంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకూడదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్‌తోపాటు పట్టణ బహిష్కరణ వేటు తప్పదన్నారు. రౌడీ షీటర్లపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. గొడవల జోలికెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

అథ్లెటిక్స్‌లో ఉపాధ్యాయుడి ప్రతిభ


బంగారు పతకం అందుకుంటున్న ఉపాధ్యాయుడు హనుమంతు

పుట్టపర్తి: మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం జేఎన్‌టీయూలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ఉపాధ్యాయుడు హనుమంతు ప్రతిభచాటాడు. పాముదుర్తి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు హనుమంతు 100 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించాడు. దీంతో తోటి ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

మానవ సేవే మాధవ సేవ


సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ కోర్టు జడ్జి శివ శంకర్

పుట్టపర్తి: మానవ సేవే మాధవ సేవ అని, సాటి మనిషికి సాయం చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని అనంతపురం స్పెషల్ కోర్టు జడ్జి శివశంకర్ పేర్కొన్నారు. కొత్తచెరువు మండలం కేశాపురానికి చెందిన హిందీ పండిట్ మొర్రెడ్డిగారి నాగిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆదిశేషారెడ్డి, పురుషోత్తమరెడ్డి చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ వైద్యులతో గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పది రోజులపాటు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం వైద్య శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య విశిష్ట అతిథిగా జడ్జి హాజరై మాట్లాడారు. ఎన్ని రూ.కోట్ల డబ్బున్నా మనిషికి తృప్తి ఉండదని.. పది మందికి ఉపయోగపడే సేవా కార్యక్రమం చేస్తే ఎంతో సంతృప్తినిస్తోందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఎంతోమంది పేదల కళ్లల్లో వెలుగులు నింపేందుకు అత్యాధునిక మొబైల్ వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. దాదాపు 700 మందికి కంటి పరీక్షలు చేసి.. 131 మందికి ఇక్కడే ఉచితంగా ఆపరేషన్లు చేయించిన ఆదిశేషారెడ్డిని మెచ్చుకున్నారు. మరో 92 మందికి చెన్నైలో ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు అలెక్సా, దివ్య, షానికా, రంజిత్ కుమార్, విశ్రాంత్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, లాయర్ పుట్టపర్తి ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మలకవేమల మండల సాధన కమిటీ ఏర్పాటు


ఐక్యత చాటుతున్న మండల సాధన కమిటీ సభ్యులు

ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలంలోని మలకవేమల క్రాస్‌ను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ మండల సాధన కమిటీని ఏర్పాటు చేశారు. ఆదివారం కమిటీ ఏర్పాటుపై పలువురు సమావేశమై చర్చించారు. ముదిగుబ్బకు సుదూరంగా ఉన్న కొన్ని గ్రామాలను కలిపి మలకవేమల క్రాస్‌ను ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కమిటీ కన్వీనర్‌గా అడ్వొకేట్ భైరవ ప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా చినగాని నరసింహయాదవ్, రవీంద్రనాయుడు, ఉప కన్వీనర్‌గా కోటిరెడ్డి కోటేశ్వర్‌రెడ్డి, కోశాధికారులుగా బయపరెడ్డి, శ్రీరామ నాయక్, గౌరవాధ్యక్షులుగా రఘునాథరెడ్డి, శ్రీరాములు, రామాంజినేయులు, వీరనారాయణ, అశ్వర్థ నారాయణ, జీవ్లా నాయక్, జీవీ నాయుడు, సుబ్బిరెడ్డిలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పలు కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుమ్మడి కాయలకు గిరాకీ


విక్రయానికి సిద్ధంగా ఉన్న గుమ్మడి కాయలు

బత్తలపల్లి: తెలుగువారి అచ్చమైన పదహారణాల పండుగ సంక్రాంతి. ఈ పండుగలో ప్రధానమైనది గుమ్మడి కాయ. అలాంటి గుమ్మడి కాయ గతంలో ఎక్కడైనా లభించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీంతో వ్యాపారుల వద్దకు వెళ్లి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బత్తలపల్లిలోని కదిరిరోడ్డుకు గల అన్నపూర్ణ కూరగాయల మండీలో విక్రయానికి గుమ్మడి కాయలను తీసుకువచ్చారు. బాగా డిమాండ్ ఉన్నట్లు మండీ నిర్వాహకుడు తెలిపారు. గుమ్మడి సైజును బట్టి రూ.50 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ధర్మవరం రూరల్: గొల్లపల్లి సమీపంలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల.. ధర్మవరం గాంధీనగర్‌కు చెందిన ఆదిమూర్తి, బడన్నపల్లికి చెందిన రాజారెడ్డి, కార్తీక్‌రెడ్డి మరూరు గ్రామానికి బైక్‌పై బయలుదేరారు. మరూరు గ్రామానికి చెందిన మూర్తి అనే వ్యక్తి బైక్‌పై ధర్మవరం వైపు వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రస్తా విషయంలో ఘర్షణ

ధర్మవరం రూరల్: మండలంలోని బిల్వంపల్లి గ్రామంలో ఆదివారం పొలానికి వెళ్లే రస్తా విషయమై చిన్న పాటి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో కార్తీక్, నరసింహులు, చంద్రకళకు గాయాలయ్యాయి. ఈ విషయమై ఇరు వర్గాల వారు రూరల్ పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం


రథంలో కొలువైన వల్లి దేవసేన సుబ్రహ్మణ్యస్వామి


రథం ముందు నృత్యం చేస్తున్న చిన్నారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలో సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎస్ఎల్‌వీ మార్కెట్‌లోనున్న నాగుల కట్ట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి షష్టి పూజలు జరిగాయి. అనంతరం ప్రత్యేక రథంపై శ్రీ వల్లి, దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులను వివిధ రకాల పూలతో అలంకరించి రథంపై కొలువుదీర్చారు. పట్టణంలోని పీఆర్‌టీ సర్కిల్, అంజుమన్ సర్కిల్, తేరుబజార్ వరకు వందలాది మంది భక్తులు రథాన్ని లాగారు. ఆలయ కమిటీ సభ్యులు బండ్లపల్లి రంగనాథ్, నాగేశు, విజయ్ తదితరులు రథోత్సవాన్ని పర్యవేక్షించారు. అయ్యప్ప మాలధారులైన చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయించి రథోత్సవ వేడుకలను సజావుగా జరిగేలా కృషి చేశారు.

8న తాడిమర్రిలో కేంద్ర కరువు బృందం పర్యటన

తాడిమర్రి: మండలంలో ఈనెల 8న కేంద్ర కరువు బృందం పర్యటించనున్నట్లు ఏఓ రమాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారుల బృందం ఎం.అగ్రహారం, మరవపల్లి గ్రామాల మీదుగా తాడిమర్రికి చేరుకుంటుందని, ఉదయం 11.50 గంటల నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు తాడిమర్రి సమీపంలోని రైతులు సాగు చేసిన ఉలవ, జొన్న పంటలను పరిశీలించి రైతులతో ముఖాముఖి నిర్వహిస్తుందని పేర్కొన్నారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎక్సిబిషన్‌ను తిలకిస్తుందని తెలిపారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలన్నారు.

ప్రజలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే కేసులు


హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్

ధర్మవరం అర్బన్: హిజ్రాలు ప్రజలతో డబ్బు విషయంలో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడులకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. హిజ్రాలు స్పీడు బ్రేకర్ల వద్ద వాహనదారులను అడ్డగించి డబ్బులు డిమాండ్ చేయడం పద్ధతి కాదన్నారు. ఎవరైనా డబ్బులు ఇస్తే తీసుకోవాలే గాని బలవంతం చేయకూడదన్నారు. వ్యాపారస్తులు, దుకాణాల వద్దకు వెళ్లి డబ్బు కోసం బెదిరించడం, డబ్బులు ఇవ్వకపోతే అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేదిక్ మ్యాథ్స్ జోనల్ స్థాయి పోటీలు


విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసిన దృశ్యం

ధర్మవరం రూరల్: పట్టణంలోని ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం విశ్వం ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో జోనల్ స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు సంధారాఘవ, పాఠశాల చైర్మన్ కొండన్న, కరస్పాండెంట్ జనార్ధన్, జోనల్ మేనేజర్ శివాంజినేయులు, విశ్వం టీం సభ్యులు విజేతలకు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌తో విద్యార్థులలో నైపుణ్యం పెరుగుతుందని వారు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

మట్టి మాఫియాకు అడ్డుకట్టేదీ?




రావులచెరువు వద్ద నుంచి ట్రాక్టర్ల ద్వారా గరుసు మట్టిని తరలిస్తున్న దృశ్యం . టిప్పర్లు, ట్రాక్టర్లు వెళ్లడంతో ఛిద్రమవుతున్న రోడ్డు

ధర్మవరం రూరల్: మట్టి మాఫియా యథేచ్ఛగా సాగుతోంది. ధర్మవరం పట్టణ శివారులోని వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చి వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ వెంచర్ చదును చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి మట్టిని వినియోగిస్తున్నారు. రేగాటిపల్లి యర్రగుట్ట, రావులచెరువు సమీపాన గుట్టలలో లభించే నాణ్యమైన గరుసు మట్టిపై రియల్టర్ల కన్ను పడింది. అందులో భాగంగా ఈ ప్రాంతాల నుంచి రాత్రింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా గరుసు మట్టిని తరలిస్తున్నారు. అధిక టన్నేజీతో వెళ్లడం వల్ల రహదారులు పాడవుతున్నాయని గ్రామస్తులు అడ్డు చెబుతున్నారు. అయితే వాహనదారులు కూటమి నాయకుల పేర్లు చెప్పుకుని దర్జాగా మట్టి తోలుకుంటున్నారు. మట్టి మాఫియాపై అటు పోలీసులకు, ఇటు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా వారి నుంచి సరైన స్పందన కనిపించడం లేదని రావులచెరువు గ్రామానికి చెందిన పలువురు వాపోతున్నారు. వాల్టా చట్టం మేరకు చెరువులు, గుట్టల నుంచి మట్టిని తరలించాలన్నా తహసీల్దార్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇవేవీ పాటించడం లేదు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.